

టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 904 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.45

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.45. కనిష్టంగా రూ.32 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం

37.5°/21.5°

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికమైంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

ధర్మవరం- చెన్నై బస్సు సర్వీసు ప్రారంభం



నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం అర్బన్: ధర్మవరం- చెన్నై మధ్య నూతన బస్సు సర్వీసును రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో నూతన బస్సు సర్వీసుకు మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సర్వీసు ధర్మవరం నుంచి బయలుదేరి పుట్టపర్తి, కదిరి, తిరుపతి మీదుగా చెన్నైకి వెళ్తుందని అధికారులు తెలిపారు. ధర్మవరం నుంచి చెన్నైకి టికెట్ రూ.775గా నిర్ణయించారు. గతంలో పుట్టపర్తి వాసులు తిరుపతికి వెళ్లేందుకు సరైన బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడేవారని, ప్రస్తుతం ఈ బస్సు సర్వీసుతో ఇబ్బందులు లేకుండా తిరుపతి వెళ్లవచ్చని అధికారులు తెలిపారు. బస్సు సర్వీసు ప్రారంభం అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ అదే బస్సులో మున్సిపల్ కార్యాలయం వరకు ప్రయాణించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. మంత్రి వెంట ఆర్టీసీ డీఎం సత్యనారాయణ, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ఉన్నారు.

మంత్రికి ఆర్టీసీ యూనియన్ నాయకుల వినతి

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సమస్యలపై వినతిపత్రం అందించారు. గతంలో ఉన్న పల్లె వెలుగు సర్వీసులను, విజయవాడ సూపర్ లగ్జరీ, మంత్రాలయం ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేబీ నాగార్జునరెడ్డి, రీజనల్ జాయింట్ కార్యదర్శి బి.నరసింహులు, డిపో కార్యదర్శి ముస్తఫా, ఏడీసీ మేడాపురం నరసింహులు, మునయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచితం..ఉత్తిదే!

నల్లబోయినపల్లి ఇసుక స్టాక్ పాయింట్ నుంచి బత్తలపల్లికి 18 కి.మీ దూరం ఉంటుంది. ట్రాక్టర్‌లో అయితే నాలుగు టన్నులు, టిప్పరుకు అయితే 18 టన్నుల ఇసుక రవాణా చేస్తారు. స్టాక్ పాయింట్ నుంచి బత్తలపల్లికి ట్రాక్టరు ఇసుక తేవాలంటే రవాణా ఖర్చులతో కలిపి రూ.4 వేలు అవుతోంది. ఆ లెక్కన టిప్పరుకు అయితే రూ.18 వేలు అవుతుంది. అప్పుడు టన్ను ఇసుక రూ.వెయ్యి పైగా వెచ్చించి కొన్నట్లు అవుతుంది. కూటమి ప్రభుత్వం అట్టహాసంగా ప్రచారం చేస్తున్న ఉచిత ఇసుక ఎక్కడ ఉందంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- నిర్వహణ...సీనరేజీ చార్జీల పేరుతో దందా
- టన్ను రూ.277 చొప్పున విక్రయిస్తోన్న సర్కారు
- ట్రాక్టరు ఇసుకకు రూ.వెయ్యి, రవాణాకు రూ.2 వేలకు పైగానే వ్యయం
- జిల్లాలో ఐదు స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా
- రవాణా చార్జీలను పది శాతం పెంచే ఆలోచనలో వాహనదారులు
- సర్కారు మాటలు బూటకమని మండిపడుతున్న జనం



బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి వద్ద జేసీబీతో ఇసుకను టిప్పర్‌లోకి లోడ్ చేస్తున్న దృశ్యం

ఇసుక టన్ను ధర	రూ. 277	
ఒక వ్యక్తికి రోజుకు అందజేసే ఇసుక	20 టన్నులు	
ఇసుక సరఫరా సమయం	ఉ.6 నుంచి సా.6 వరకు	

సాక్షి, పుట్టపర్తి

'ఉచిత ఇసుక' అంతా ఉత్తిదేనని తేలిపోయింది. సీనరేజీ, నిర్వహణ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం సామాన్యుల జేబులకు చిల్లు పెడుతోంది. పేరుకు ఉచితమే అయినా టన్ను రూ.227తో కొనుగోలు చేయాలి. ఆ తర్వాత రవాణా చార్జీలు అదనం. ఈ లెక్కన ప్రజలకు టన్ను తక్కువలో తక్కువ రూ.1000 పడుతోంది. ఇక ఉచితం ఎక్కడంటూ జనం నిలదీస్తున్నారు.

రాత్రికి రాత్రే రవాణా

ఎన్నికల ఫలితాలు రోజు నుంచే తెలుగు తమ్ముళ్లు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను అక్రమంగా తరలించి డంప్ చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి.

ప్రస్తుత రేట్లు ఇలా.. (ట్రాక్టరుకు)

ఎక్కడి నుంచి ఎక్కడికి	మధ్యదూరం	ధర (4 టన్నులకు)
కుటాగుళ్ల నుంచి కదిరి	4 కి.మీ	రూ.3 వేలు
నల్లబోయినపల్లి నుంచి బత్తలపల్లి	18 కి.మీ	రూ.4 వేలు
కొడవండ్లపల్లి నుంచి ముదిగుబ్బ	12 కి.మీ	రూ.3.5 వేలు

ఇప్పుడు ఆయా స్థలాల నుంచి ఇతర ప్రాంతాలకు రాత్రికి రాత్రే చేరవేస్తున్నట్లు తెలిసింది. నెల రోజుల వ్యవధిలోనే ఇసుక ద్వారా జిల్లాలో రూ.కోట్లు కొల్లగొట్టినట్లు సమాచారం. జిల్లా పరిధిలో నల్లబోయినపల్లి, ఉప్పలపాడు, కొడవండ్లపల్లి, కుటాగుళ్ల, రామగిరిలో ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఐదు పాయింట్లలో కలిపి 61,300 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉంచారు. కూటమి ప్రభుత్వం చెబుతున్నట్లు ఉచిత ఇసుక ఎక్కడా లేదని.. అన్ని ప్రాంతాల్లో వేలాది రూపాయలు చెల్లించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. నాలుగు కిలోమీటర్ల దూరానికి కూడా ట్రాక్టర్ (4 టన్నులు) ఇసుకకు రూ.3 వేలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రవాణా పేరుతోనూ దోపిడీ

స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను తీసుకెళ్లాలంటే.. తెలుగు తమ్ముళ్లు ఏర్పాటు చేసిన వాహనాలనే వినియోగించాలి. అడిగినంత అద్దె ఇవ్వాల్సిందే. సొంతంగా వాహనాలను తీసుకెళ్లి.. టన్నుకు రూ.277 చెల్లిస్తామన్నా.. ఒప్పుకోని పరిస్థితి. ఉచితంగా ఇసుక ఇస్తామని ప్రకటించి, ఇప్పుడేమో టన్నుల ప్రకారం ధర నిర్ణయించడంతో పాటు రవాణా ఖర్చులు కూడా ఏకపక్ష తీర్మానం చేసి మోయలేని భారం మోపుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. కిలోమీటరు లెక్కన రవాణా చార్జీలు ఎడాపెడా పెంచి.. భారం మోపుతున్నారని మండిపడుతున్నారు.

స్టాక్ పాయింట్లు	ఇసుక నిల్వల వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)
1) ఉప్పలపాడు	11,580
2) కొడవండ్లపల్లి	28,417
3) నల్లబోయినపల్లి	12,597
4) కుటాగుళ్ల	8,644
5) రామగిరి	63
మొత్తం	61,300

ఉచితం అంటే ఇదేనా?



ఉచితమని ఊరించారు. తీరా ఇసుక విధానం ప్రకటించిన తర్వాత అసలు విషయం వెలుగు చూసింది. గత ప్రభుత్వానికి మించి చేతి చమురు వదులుతోంది. కూటమి ప్రభుత్వం నిర్ణయించిన ఇసుక పాలసీతో భవన నిర్మాణదారులు, తాపీ పని కూలీలకు భారీ నష్టం. రవాణా చార్జీలు భరించలేనంతగా ఉన్నాయి. ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పి టన్నుకు రూ.277 చెల్లించాలని తీర్మానించడం దారుణం.

– బోయ సాంబ, ఈడుల ముష్టూరు, బత్తలపల్లి మండలం

ట్రాక్టర్ ఇసుకకు రూ.1,385 చెల్లించాలంట



అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా ఇస్తానని చంద్రబాబు చెప్పారు. అధికారంలోకి వచ్చినా హామీలు అమలు చేయడం లేదు. ఉచితమని ఇసుక రీచ్‌ల వద్దకు వెళితే అక్కడ టన్నుకు రూ.277 చెల్లించాలని చెబుతున్నారు. ట్రాక్టర్‌కు రూ.1,385 చెల్లిస్తేనే ఇసుక ఇస్తామంటున్నారు. ఇసుక ఉచితమన్నారు... ఎక్కడ బాబుగారు మీరే చెప్పండి.

– డి. చంద్రాయుడు, ముదిగుబ్బ

'సమగ్ర శిక్ష'లో వేతన వెతలు!

సమగ్ర శిక్ష పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతన వెతలు అన్నీ ఇన్నీకావు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రతి నెలా రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ జీతాలు అందేలా చూస్తామని గతంలో టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి రెండోనెల నడుస్తున్నా జీతాలు అందక జిల్లాలోని 1,300 మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అందని జీతాలు
- జిల్లాలో 1,300 మందికి 3 నెలలుగా పెండింగ్
- కుటుంబ నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు
- కుటుంబ పోషణ, పిల్లల చదువుల ఫీజుల కోసం ఇక్కట్లు



బుక్కపట్నంలోని సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం

పుట్టపర్తి: సమగ్రశిక్ష ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2,800 మంది ఉద్యోగులు ఉన్నారు. అందులో శ్రీసత్యసాయి జిల్లాలో 1,300 మంది పనిచేస్తున్నారు. వీరిలో కేజీబీవీల్లో ప్రిన్సిపాళ్లు, సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీలు, నాన్ టీచింగ్ ఉద్యోగులు కంప్యూటర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, అటెండర్లు, అకౌంటెంట్లు, వాచ్‌మన్లు, కుక్‌లు, ఏఎన్‌ఎంలు, మండల రీసోర్స్ సెంటర్ల (ఎమ్మార్సీ)లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీలు, ఫిజియోథెరపిస్టులు, ఆయాలు, జిల్లా సమగ్ర కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, సైట్ ఇంజినీర్లతో పాటు డీఎంఎల్‌టీలు ఉన్నారు. టీడీపీ నేతల హామీ ఇచ్చినట్లు తమకూ 1వ తేదీనే జీతాలు అందుతాయని వీరంతా భావించారు. కానీ వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఇప్పటికే మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉండగా...ఎవరిని అడగాలో తెలియక అల్లాడిపోతున్నారు.

అప్పులు పుట్టక అగచాట్లు

చాలీచాలనీ జీతాలతో నెట్టుకొస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కుటుంబాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటుంది. ప్రస్తుతం సక్రమంగా జీతాలు రాకపోవడంతో నిత్యావసర సరుకులు కొనుగోలుకు కూడా ఇబ్బందులు పడుతున్నామని వారంతా వాపోతున్నారు. ఇంటి అద్దెలు కూడా చెల్లించలేకపోతున్నామని, దీనికితోడు పిల్లల స్కూల్ ఫీజులు, పుస్తకాల కొనుగోలు, యూనీఫాం తదితర ఖర్చులు తడిసిమోపెడవుతాయంటున్నారు. ఇలాంటి సమయంలో జీతాలు రాకపోతే తమ పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలని అంటున్నారు. జీతం ఎప్పుడు వస్తుందో తెలియకపోవడం వల్ల రుణదాతలు కూడా అప్పులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సమ్మె కాలానికి సంబంధించిన 21 రోజుల వేతనం కూడా ఇప్పటి వరకు ప్రభుత్వం మంజూరు చేయలేదంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెద్దలు చిరుద్యోగులైన తమపట్ల వివక్ష మాని జీతాలు సక్రమంగా చెల్లించేలా చూడాలని విన్నవిస్తున్నారు.

కనికరం చూపని మంత్రి లోకేశ్

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఇప్పటికే 5 సార్లు కలిశారు. సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు సమర్పించారు. అయినా ఆయన కనికరం చూపలేదని, కనీసం జీతాలు కూడా మంజూరు చేయలేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి అద్దె కూడా కట్టలేదు



రెండు నెలలుగా జీతాలు రాక సమగ్ర శిక్ష పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చాలామంది కనీసం ఇంటి అద్దెలు కూడా కట్టలేదు. పిల్లల చదువుల ఫీజులు చెల్లింపునకు ఇక్కట్లు పడుతున్నారు. ఉద్యోగులకు అప్పులు కూడా పుట్టడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి జీతాలు మంజూరు చేయాలి.

– కె.విజయ్, చైర్మన్, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ, ఉమ్మడి అనంతపురం జిల్లా

జిల్లా అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దాం

- ఉద్యోగులకు కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు
- జిల్లా అభివృద్ధి సమావేశానికి సిద్ధంగా ఉండాలని వెల్లడి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్, చిత్రంలో జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లా అభివృద్ధికి అందరం సమష్టిగా పనిచేద్దామని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలిపేందుకు అందరి సహకారం అవసరమన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జేసీ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈఓ వైఖోం నిదియాదేవి, డీఆర్‌ఓ కొండయ్య, సీపీఓ విజయ్‌కుమార్‌తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. గురువారం జరగనున్న జిల్లా అభివృద్ధి సమావేశానికి అధికారులంతా నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు.

నిబద్ధతతో పని చేయాలి

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ప్రతి అధికారి నిజాయతీ, నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ అన్నారు. సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందేలా చూడాలన్నారు. ఉచిత ఇసుక విధానం అమలులో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాలన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణకు త్వరలోనే చర్యలు తీసుకోవాలన్నారు.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలి

జిల్లా అభివృద్ధి సలహా సమావేశంలో వ్యవసాయ, అనుబంధ శాఖలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ శాఖల ప్రగతి, చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. మడకశిర నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జలవనరుల శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పథకాల అమలుపై మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, ప్రజా పంపిణీ వ్యవస్థ, వసతి గృహాల్లో నిద్ర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ, పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చేపట్టే పనులను పర్యవేక్షించాలన్నారు.

పోస్టర్లు విడుదల

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను, డెంగీ వ్యతిరేక మాసోత్సవ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మంజువాణి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

అంతకుముందు టీఎస్ చేతన్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ నుంచి ఆయన చార్జ్ తీసుకున్నారు. ఉదయం 9 గంటలకే ఆయన కలెక్టరేట్‌కు చేరుకోగా, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నేరుగా ఛాంబర్‌కు వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య అన్ని శాఖల అధికారులు నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక ధామం పుట్టపర్తి కేంద్రంగా ఆవిర్భవించిన శ్రీసత్యసాయి జిల్లాను అభివృద్ధిలోనూ అగ్రగామిగా నిలుపుతామన్నారు.



జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ చేతన్

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం టీఎస్ చేతన్ నేరుగా అనంతపురం వెళ్లి ఉమ్మడి జిల్లా జడ్జి జి. శ్రీనివాస్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉద్యోగుల నిరసన

పుట్టపర్తి: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసనకు దిగారు. రాష్ట్ర సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా స్థాయిలో నిరసనలకు పిలుపునిచ్చినట్లు జిల్లా జేఏసీ అధ్యక్షుడు ఓబిరెడ్డి, ప్రధానకార్యదర్శి రామన్న తెలిపారు. బుధవారం బుక్కపట్నం మండల రీసోర్స్, మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట డిమాండ్లతో కూడుకున్న ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని, ఏడాదికి సరిపడా బడ్జెట్‌ను ఒకే దఫా విడుదల చేయాలని, తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కమిటీ సభ్యులు నాగరాజు హేమావతి, రజని పాల్గొన్నారు.



బుక్కపట్నం ఎంఈఓ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

టీబీ డ్యాంలో 25 టీఎంసీల నీరు



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయం నీటి నిల్వ 25.173 టీఎంసీలకు చేరింది. ఇన్‌ఫ్లో బుధవారం ఉదయానికి 27,544 క్యూసెక్కులకు చేరింది. అవుట్‌ఫ్లో 199 క్యూసెక్కులుగా నమోదవుతోంది. 1,633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1,602.67 అడుగుల వరకు నీరు చేరాయి. జలాశయానికి ఎగువన ఉన్న శివమొగ్గ, శృంగేరి, తీర్థనహళ్లి, ఆగుంబే తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గతడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 1,578.79 అడుగులతో 3.911 టీఎంసీల నీరు ఉండింది. 9,892 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 255 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ మాధవరెడ్డి



కలెక్టర్ టీఎస్ చేతన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్/అర్బన్: జిల్లా నూతన కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన టీఎస్ చేతన్‌ను ఎస్పీ మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టర్ చేతన్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల అంశంపై చర్చించారు.

రాష్ట్ర హాకీ జట్టులో చోటు



ఎంపికైన క్రీడాకారులతో హాకీ ఏపీ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, తదితరులు

ధర్మవరం అర్బన్: వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన దక్షిణాది రాష్ట్రాల జూనియర్ బాలబాలికల హాకీ చాంపియన్ షిప్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, జిల్లా జాయింట్ కార్యదర్శి అరవింద్‌గౌడ్, జిల్లా కోచ్ హుస్సేన్ తెలిపారు. టోర్నీలో జిల్లాకు చెందిన క్రీడాకారులు మహబూబ్‌బాషా, ప్రవిత, సింధు, నసీమా ప్రతిభ చాటుకుని రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

పట్టాల వద్ద వ్యక్తి మృతదేహం



మృతుడు

హిందూపురం అర్బన్: హిందూపురం రైల్వే స్టేషన్ పరిధిలోని దేవరపల్లి రైల్వే స్టేషన్‌కు గౌరిబిదనూరు వైపు 50 మీటర్ల దూరంలో పట్టాల వద్ద బుధవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి (40)మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. అనంతపురం వైపు నుంచి బెంగళూరు వెళ్లే రైలు కింద పడి మృతి చెందాడా? లేదా పట్టాలు దాటే సమయంలో రైలు ఢీకొని మృతి చెందాడా? రైలులో ప్రయాణిస్తూ జారి కిందపడి మృతి చెందాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు హిందూపురం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఆణిముత్యాలు అటకెక్కినట్టేనా?

కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లకు చెందిన యోజన అనే బాలిక 2023–24 విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో 595 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. జగన్ హయాంలో అయితే ఈ బాలికకు 'జగనన్న ఆణిముత్యాలు' పథకం ద్వారా రూ.50 వేల నగదు ప్రోత్సాహకం వచ్చేది. కానీ రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం మెరిట్ విద్యార్థులకు ఇచ్చే నగదు ప్రోత్సాహకాలపై ఇప్పటి వరకూ ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. జిల్లా, నియోజకవర్గ, పాఠశాల స్థాయిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 'ఆణిముత్యాలు' ఎందరో నగదు ప్రోత్సాహకాల కోసం ఎదురు చూస్తున్నారు.

- టెన్త్, ఇంటర్ టాపర్లకు నగదు బహుమతులు
- జిల్లా స్థాయిలోనూ నగదు ప్రోత్సాహకాలు అందించిన జగన్ సర్కార్
- ఈసారి ఇప్పటి వరకూ విడుదల కాని మార్గదర్శకాలు
- అయోమయంలో మెరిట్ విద్యార్థులు
- కొత్త ప్రభుత్వం పథకం అమలు చేస్తుందా...లేదా అన్న సందేహాలు



గత ఏడాది రాష్ట్ర స్థాయి ఆణిముత్యాలు పురస్కారలు అందుకున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు (ఫైల్)

కదిరి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు తోటి విద్యార్థుల్లోనూ స్ఫూర్తి నింపడం కోసం గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'ఆణిముత్యాలు' అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించింది. ఈ పథకాన్ని ఏటా అమలు చేస్తామని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. చెప్పినట్లుగానే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లోనే కాకుండా పాఠశాల స్థాయిలో కూడా అధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. 10వ తరగతిలోనే కాకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతూ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సైతం నగదు బహుమతులు అందించారు. అంతే కాకుండా వారికి పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను సైతం గత ప్రభుత్వం సత్కరించింది. కానీ ఈ ప్రభుత్వం 'ఆణిముత్యాలు' పథకంపై ఇప్పటిదాకా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో 2023–24 విద్యాసంవత్సరంలో అధిక మార్కులు తెచ్చుకున్న ఎందరో విద్యార్థులు తమను 'ఆణిముత్యాలు' పథకం ద్వారా గుర్తిస్తారా? లేదా అనే సందిగ్ధంలో ఉన్నారు.

గత సర్కారు ఇచ్చిన నగదు ప్రోత్సాహకాలు ఇలా..

స్థాయి	ప్రథమ	ద్వితీయ	తృతీయ
రాష్ట్ర స్థాయి	రూ.లక్ష	రూ.75 వేలు	రూ.50 వేలు
జిల్లా స్థాయి	రూ.50 వేలు	రూ.30 వేలు	రూ.15 వేలు
నియోజకవర్గ	రూ.15 వేలు	రూ.10 వేలు	రూ.5 వేలు
పాఠశాల స్థాయి	రూ.3 వేలు	రూ.2 వేలు	రూ.1000

రాష్ట్ర స్థాయి టాపర్‌కు రూ.లక్ష

గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో టెన్త్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చదివి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు రూ.లక్ష చొప్పున నగదు బహుమతి అందజేసింది. అలాగే రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.75 వేలు, తృతీయ స్థానం దక్కించుకున్న వారికి రూ. 50 వేల చొప్పున అందించింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా తన చేతుల మీదుగా విద్యార్థులకు నగదు బహుమతి అందించి మెడల్స్, సర్టిఫికెట్లను కూడా ప్రధానం చేసి అభినందించేవారు. దీంతో మిగతా వారు కూడా ఎలాగైనా సరే తామూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోవాలన్న కసితో చదివేవారు.

వివిధ స్థాయిల్లో ప్రోత్సాహకాలు

రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో కూడా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన టెన్త్, ఇంటర్ విద్యార్థులకు వైఎస్ జగన్ ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందజేసింది. జిల్లా టాపర్‌కు రూ.50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 30 వేలు, తృతీయ స్థానం దక్కించుకున్న వారికి రూ. 15వేలు అందజేశారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిల్చిన వారికి రూ. 5 వేలు ఇచ్చారు. ఇక పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరచిన వారిని ప్రోత్సహించేందుకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.3 వేలు, రూ. 2 వేలు, రూ.1,000 చొప్పున 'ఆణిముత్యాలు' పథకం ద్వారా గత ప్రభుత్వం అందజేసింది.

గతంలో జూన్ 20 నాటికే పూర్తి

2022–23 విద్యాసంవత్సరంలో 'ఆణిముత్యాలు' పథకం ద్వారా జిల్లాలో వివిధ స్థాయిల్లో నగదు ప్రోత్సాహక బహుమతులు అందుకున్న టెన్త్, ఇంటర్ విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు. జిల్లా స్థాయిలో ఆరుగురు, నియోజకవర్గ స్థాయిలో 42 మంది, పాఠశాల స్థాయిలో సుమారు 600 మంది దాకా ఉన్నారు. గత ఏడాది జూన్‌లో పాఠశాలలు పునః ప్రారంభం కాగానే 'ఆణిముత్యాలు' పథకం ప్రక్రియ ప్రారంభించి జూన్ 20 నాటికి పాఠశాల స్థాయిల్లో కూడా నగదు ప్రోత్సాహకం పంపిణీ పూర్తి చేశారు. కానీ 2023–24 విద్యాసంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకం ఇచ్చే విషయంలో 'కూటమి' ప్రభుత్వం ఇంకా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సందిగ్ధంలో ఉన్నారు. ఈ ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను మరింత పెంచి టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రోత్సాహకాలు వెంటనే ఇవ్వాలి



గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు వెంటనే నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయాలి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వీటిని ప్రతి ఏటా కొనసాగిస్తామని చెప్పారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు, లేదా విద్యాశాఖామంత్రి లోకేష్ వెంటనే స్పందించి 'ఆణిముత్యాలు' పథకాన్ని వెంటనే అమలు చేసి మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించాలి.

–బాబ్జాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

మార్గదర్శకాలు రావాలి



2022–23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో చదువుతూ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పాఠశాల స్థాయిల్లో టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అప్పటి ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు ఇచ్చిన మాట వాస్తవమే. 2023–24 విద్యాసంవత్సరానికి గానూ ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. రాగానే మెరిట్ విద్యర్థులను గుర్తించి నగదు ప్రోత్సాహకాలు అందేలా చూస్తాం.

–మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారి

గంజాయి విక్రేతల అరెస్ట్

పావగడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని హులిబెట్ట తండా సమీపంలో ఉన్న బాలాజీ లే అవుట్ మోరీ వద్ద నిర్జన ప్రదేశంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిని గౌస్‌మోద్దీన్, కుమార్‌గా గుర్తించారు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో నిందితులిద్దరూ ఓ ఆటో వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుంటే గస్తీ కానిస్టేబుళ్లు శ్రీకాంత నాయక్, సంతోష్, తల్వార్ రాజు గుర్తించారు. దీంతో ఆటోను అడ్డుకుని తనిఖీ చేశారు. వెనుక సీటులోని సంచిలో 850 గ్రాముల గంజాయి ఆకులను గుర్తించి, విచారణలో గంజాయిని విక్రయిస్తున్నట్లుగా నిందితులు అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

సోమందేపల్లి: స్థానిక నక్కలగుట్ట కాలనీ వద్ద ఒడిశాకు చెందిన ఇద్దరి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ డీఎస్పీ బాజీ జాన్ సైదా తెలిపారు. బుధవారం పెనుకొండ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒడిశాకు చెందిన బలరామ్ బాగ్, పింటూ నాయక్ ఓ బ్యాగ్ పట్టుకుని అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. బ్యాగ్‌లో రూ.50 వేలు విలువ చేసే రెండు కిలోల గంజాయిని గుర్తించి స్టేషన్‌కు తరలించారు. విచారణలో ఒడిశాలో తక్కువ మొత్తానికి గంజాయి కొనుగోలు చేసి రైలు మార్గంలో వచ్చినట్లు నిందితులు వివరించారు. హిందూపురం, పెనుకొండ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశిన, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

పరిగి: జయమంగళీ నది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి, కేసులు నమోదు చేసినట్లు ఏఎస్ఐ హిదాయతుల్లా తెలిపారు. జయమంగళీ నది నుంచి కొన్ని రోజులుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం రాత్రి పరిగి పోలీసులు నది ప్రాంతంలో నిఘా ఉంచారు. అర్ధరాత్రి సమయంలో కొందరు ఇసుక తవ్వుకుని ట్రాక్టర్లలో నింపుతున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి వెళ్లి ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసులు నమోదు చేశారు. ప్రభుత్వం ఇసుక పాలసీని ప్రకటించిన నేపథ్యంలో పరిగి మండలంలో ఎక్కడా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయలేదని పోలీసులు తెలిపారు. అయినప్పటికీ కొంతమంది అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. ఇప్పటి వరకూ పరిగి పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో ఎనిమిది కేసులు నమోదు చేశామన్నారు.

నేడు జిల్లా స్థాయి సమీక్ష సమావేశం

పుట్టపర్తి అర్బన్: జిల్లా సమగ్రాభివృద్ధిపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పుట్టపర్తిలోని సాయి ఆరామంలో సమావేశం ఉంటుందన్నారు. సమీక్షా సమావేశానికి రాష్ట్ర, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎంపీ పార్థ సారథి, ఎమ్మెల్యేలు హాజరవుతారని వెల్లడించారు. జిల్లాలోని అన్ని శాఖలపై సమీక్ష ఉంటుందని, సంబంధిత అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పుట్టపర్తి అర్బన్: వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, స్కీమ్ వర్కర్లు, ఉద్యోగులపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్–డే నిర్వహించారు. పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు ఇంతియాజ్ మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, వైకేపీ, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్, స్వచ్ఛ భారత్ ఉద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబావలి, రాజూరావు, మాబున్నీసా, సావిత్రమ్మ, లక్ష్మీదేవి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

అమడగూరు: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతో పాటు 30 శాతం ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అమడగూరు మండల వ్యాప్తంగా ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఐదేళ్లకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వాలని, 2023 జూలై 1 నుంచి కొత్త పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడితే మధ్యంతర భృతి (ఐఆర్) ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతభత్యాలను పెంచాల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 12వ పీఆర్సీని అమలు చేయడంతో పాటు గతంలో జరిగిన నష్టాన్ని భర్తీ చేసి, ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రాథమిక విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా ఉన్న జీఓ 117ను రద్దు చేయాలని, తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమల్లోకి తేవాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సుధాకర్, లక్ష్మీప్రసాద్, నారాయణస్వామి, ఈశ్వర్, మహేశ్వర్‌రెడ్డి, పాండురంగయ్య, మోహన్‌బాబు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

- ప్రియురాలితో పెళ్లి జరగదేమోనని అఘాయిత్యం



మృతుడు హరికృష్ణ

రొద్దం: ప్రేమించిన యువతితో తన పెళ్లి జరగదేమోననే అనుమానంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం తురకలాపట్నం గ్రామానికి చెందిన జయమ్మ కుమారుడు హరికృష్ణ (27) పెనుకొండలో పెయింటింగపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో హరికృష్ణకు పెళ్లి చేయాలని తల్లి, బంధువుల నిర్ణయించారు. అయితే అప్పటికే తాను ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నానని, ఆమెనే పెళ్లి చేసుకుంటానని, పెళ్లి సంబంధాలు ఏవీ చూడొద్దని హరికృష్ణ సూచించాడు. తనకు వేరే సంబంధాలు చూస్తే ఆత్మహత్య చేసుకుంటానని తెలిపాడు. అంతటితో ఆగకుండా తాను ప్రేమించిన యువతి చిత్రాన్ని ఇటీవల తన ఛాతీపై పచ్చబొట్టు వేయించుకున్నాడు. విషయం గుర్తించిన కుటుంబసభ్యులు నిలదీశారు. దీంతో మరొకరితో తనకు పెళ్లి చేస్తారని భావించిన హరికృష్ణ... జీవితంపై విరక్తితో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు తలుపు తీయాలని ఎంత సేపు పిలిచినా స్పందన లేకపోవడంతో కిటికీలో నుంచి చూశారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న హరికృష్ణను చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వలీబాషా అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జనాభా పెరుగుదల.. వనరుల తరుగుదల

నందర్భం : నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

2011 లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో జనాభా

జిల్లా	జనాభా
అనంతపురం	22,41,105
శ్రీసత్యసాయి	18,40,043
మొత్తం	40,81,148



హిందూపురం అర్బన్: దేశ జనాభాపైనే ఆ దేశ ప్రగతి ఆధారపడి ఉంటుంది. అదే జనాభా పరిమితికి మించితే ఆ దేశ అభివృద్ధి కుంటుపడుతుంది. అనేక అనర్థాలూ చవిచూడక తప్పదు. ఇది ప్రభుత్వాలకు భారంగా మారుతుంది. శరవేగంగా పెరుగుతున్న జనాభాను నియంత్రించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. జనాభా పెరుగుదలతో జీవన ప్రమాణాలపై ఒత్తిడి, నిరుద్యోగం పెరుగుతుంది. వస్తు వినియోగం పెరుగుతుంది, పొదుపు క్షీణిస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రపంచ జనాభా 500 కోట్లు చేరుకున్న సందర్భంగా 1987, జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవంగా ప్రకటించి, ఏటా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రపంచ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

సౌకర్యాలు కొరత..

పెరుగుతున్న జనాభా.. కరిగి పోతున్న వనరులతో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వాలకు తలనొప్పిగా మారింది. మరో వైపు అడవులు అంతరించి పోతున్నాయి. ఆహార దినుసుల ఉత్పత్తి, ఉపాధి కల్పన, ఆర్థికఅవసరాలు తీరడం కష్టంగా మారుతోంది. పర్యావరణ సమతుల్యత లోపించి భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెరిగిన జనాభా కారణంగా దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిపోయింది. జీవన ప్రమాణాలు నశించి పేదరికం పెరిగిపోయింది. నీటి వినియోగం పెరిగి భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. సహజ వనరులు అంతరించి ఆర్థికాభివృద్ధి కుంటుపడుతోంది. యువశక్తితోనే భారత్ ప్రపంచంలో శక్తిమంత దేశంగా అవతరిస్తుందని పాలకులు చెబుతున్నారు. అయితే మితిమీరిన జనాభా, అపరిమిత అవసరాలు, నిరుద్యోగం తీర్చలేక అనేక సవాళ్లు ఎదురయ్యే పరిస్థితిని పాలకులు గుర్తించకపోవడం బాధాకరం.

40 లక్షలకు పైగా ఉమ్మడి జిల్లా జనాభా

దేశ జనాభా ప్రస్తుతం 144.41కోట్లకు చేరుకోగా, ఇందులో ఉమ్మడి జిల్లాలో 40,81,148 జనాభా ఉన్నట్లు 2011 లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఈ జనాభా ఇలాగే పెరుగుతూ పోతే 32.87 లక్షల కిలోమీటర్ల మేర విస్తరించిన ఉన్న భారత భూభాగం జనావాసానికి తక్కువపడే సూచనలు ఉన్నాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అటవీ విస్తీర్ణం తగ్గిపోవడంతో జీవ వైవిధ్యానికి తీరని నష్టం వాటిల్లిందని అంటున్నారు. ప్రధాన నగరాలు, పట్టణాల్లో వాయు కాలుష్యం పెరిగి, పర్యావరణం దెబ్బతింటోందని హెచ్చరించారు. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే జనాభా నియంత్రణతో పాటు అటవీ విస్తీర్ణం మరింత పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచిస్తున్నారు.

ప్రజా చైతన్యం అవసరం



జనాభా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో చైతన్యం రావాలి. ఈ మేరకు ప్రభుత్వాలు, అధికారులు చర్యలు తీసుకోవాలి. జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి. క్షేత్ర స్థాయిలో మా సిబ్బందిని సమన్వయం చేసుకుని జనాభా నియంత్రణకు చర్యలు తీసుకున్నాం.

– డాక్టర్ సతీష్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యులు, మడకశిర

చిన్న కుటుంబమే మేలు



ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న కుటుంబమే మేలు. ఈ అంశంపై ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జనాభా పెరుగుదల క్రమాన్ని నియంత్రించడాన్ని, ప్రజలకు అవగాహన కల్పించడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలి.

– డాక్టర్ ప్రసాద్, వైద్యులు, హిందూపురం